ప్రజాశక్తి

శనివారం 1 ఫిబ్రవరి 2025

8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా

స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు భారం



- నేటి నుంచి పెరగనున్న భూముల విలువ
- అత్యధికంగా అవనిగడ్డ పరిధిలో 25.30 శాతం, అత్యల్పం మచిలీపట్నంలో 8.27 శాతం
- కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పన్ను పోటు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో పెరిగిన భూముల విలువ శనివారం నుంచి అమల్లోకి రానుంది. దీంతో స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌లు మరింత భారంగా మారనున్నాయి. గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన విలువ ఆధారిత పన్ను విధానం అమల్లో ఉండటంతో నగరపాలక సంస్థ, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఆస్తి పన్నులు మరింత పెరుగుతాయి. కృష్ణాజిల్లాలో అవనిగడ్డ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో భూముల విలువ అత్యధికంగా 25.38, మచిలీపట్నంలో అత్యల్పంగా 8.27 శాతం మేర పెరిగింది. కానుమోలులో 20, గన్నవరంలో 17, పెడన 15, బంటుమిల్లి 15, మొవ్వ 15, పామర్రు 15, చల్లపల్లి 13.25, ఉయ్యూరు 13, కంకిపాడు 12, గుడివాడ 12, కౌతవరం 10 శాతం చొప్పున భూముల విలువ పెరగుతుంది. భూముల విలువపై సేల్ డీడ్‌కు 6.5 స్టాంపు ఒక శాతం ఫీజు చెల్లించాలి. గిప్టుకు రిలేషన్ అయితే 2 శాతం, ఇతరులయితే 3 శాతం స్టాంప్ ఫీజు, రిజిస్ట్రేషన్ (మిగతా 2లో)



శుక్రవారం విజయవాడలోని గాంధీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

బడ్జెట్‌పై ఆశలు



- కృష్ణాలో పెండింగ్‌లో కేంద్ర ప్రాజెక్టులు
- సమగ్ర నివేదిక దశలో మచిలీపట్నం-రేపల్లె రైల్వే లైను
- గుల్లలమోదలో మిస్సైల్ లాంచింగ్ సెంటర్
- 216, 216 హెచ్ జాతీయ రహదారుల విస్తరణ
- నిధుల విడుదలే కీలకం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం శనివారం లోక్‌సభలో ప్రవేశపెడుతోంది. గత బడ్జెట్‌లలో నిర్లక్ష్యానికి గురైన కృష్ణాజిల్లా అభివృద్ధికి దోహదపడే రైల్వే, జాతీయ రహదారుల విస్తరణ, నాగాయలంక మండలం గుల్లలమోద మిస్సైల్ లాంఛింగ్ కేంద్రం తదితర పెండింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

మచిలీపట్నం-రేపల్లే రైల్వే లైను ప్రజల చిరకాల వాంఛ. దీనికోసం గతంలో రెండు సార్లు డిపిఆర్ రూపొందించినా కేంద్రం నిధులు మాత్రం కేటాయించలేదు. ఈ ప్రాజెక్టులో భాగంగా కాకినాడ- కోటిపల్లి- అమలాపురం- రాజోలు- నర్సాపురం మీదుగా మచిలీపట్నం- రేపల్లే- నిజాంపట్నం- బాపట్ల రైల్వే లైన్ నిర్మాణానికి రెండు సార్లు సమగ్ర నివేధిక (డిపిఆర్)లు ప్రభుత్వం రూపొందించింది. నరసాపురం నుంచి మచిలీపట్నం మీదుగా బాపట్ల వరకు 164.84 కిలో మీటర్ల నిర్మాణానికి రూ.3,484.58 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. కోస్తా ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఈ రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో ముందుకు సాగలేదు. మరోసారి మచిలీపట్నం- రేపల్లే- బాపట్ల రైల్వే లైను నిర్మాణానికి (మిగతా 2లో)

ఎస్‌సి వర్గీకరణపై వన్‌మ్యాన్ కమిషన్ పర్యటన

వార్త 2లో



రెల్లీస్ కాలనీలో వివరాలు సేకరిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- విజయవాడ చేరుకున్న పోలవరం నిర్వాసితుల ప్రచార జాతా



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

పోలవరం నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించి, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు ప్రాజెక్టును త్వరగా నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ కూనవరం మండలం బొజ్జరాయిగూడెం గ్రామం నుంచి బయలుదేరిన ప్రచార జాతా గురువారం రాత్రికి విజయవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల అన్ని విధాలుగా నష్టపోతున్న లక్షలాది గిరిజన పుత్రుల కుటుంబాల నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, భూ నష్ట పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులు సాగు చేసుకుంటున్న అన్ని రకాల భూములకు భూ నష్ట పరిహారం, ప్రతి ఎకరాకు రూ. 20 లక్షలు చెల్లించాలని కోరారు. పునరావాస కాలనీలకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజన గ్రామాలను (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కలుపుతూ 2023-24 కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రచార పాదయాత్ర నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. అట్టడుగు గిరిజన ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందదన్నారు. సర్వం కోల్పోతున్న నిర్వాసితులను పూర్తిగా విస్మరించడమే కాకుండా రకరకాల అడ్డంకులు సృష్టించి తీవ్ర కాలయాపన చేస్తూ ప్రాజెక్టును పూర్తి కాకుండా అడ్డుకుంటున్నది కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలేనని విమర్శించారు. 2047 స్వర్ణాంధ్ర అంటే నిర్వాసితులను పోలవరం ప్రాజెక్టులో ముంచడమేనా అని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు ప్రభుత్వాల విధానాలు కూడా నిర్వాసితులను ముంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, ప్రచార జాతా ముఖ్య బాధ్యులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ బొజ్జరాయిగూడెం నుంచి ప్రారంభమైన ప్రచార జాతాకు నిర్వాసిత గిరిజన, గిరిజనేతరుల నుంచి అనూహ్య స్పందన కనిపించిందన్నారు. ప్రభుత్వాలు తమను ఆదుకోవడం లేదని, సిపిఎం ప్రజాపోరాటాల వల్లే తమకు న్యాయం జరుగుతుందని గిరిజనులు చెబుతున్నారన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసిన కేంద్రంలోని మోడీ, కూటమి ప్రభుత్వాలు ఏజెన్సీల్లో ప్రాంతంలోనూ మత ప్రచారాన్ని ఆపడం లేదన్నారు. పోలవరం నిర్మాణ కాంట్రాక్టర్లకు ఇప్పటి ధరలకనుగుణంగా బిల్లులు చెల్లిస్తూ నిర్వాసిత గ్రామాల ప్రజలకు ఎప్పటి ధరలో ప్రకటిస్తూ వివక్షత చూపుతున్నారన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు నాలుగు రెట్లు అదనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుబ్బరావమ్మ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ప్రచార జాతా వెంట వచ్చిన సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, జిల్లా కమిటీ సభ్యులు మనకం నాగమణి, సీసం సురేష్, నాయకులు పులి సంతోష్‌కుమార్, పోలవరం మండల నాయకులు తాటి శాంతికుమారి, ఎం వీరాయమల తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై వన్‌మ్యాన్ కమిషన్ పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్రంలోని వివిధ ఎస్‌సి సబ్ క్లాస్సిఫికేషన్ రిజర్వేషన్ విధానాల ప్రయోజనాలను సమానంగా పంపిణీ చేయడానికి ప్రత్యేకమైన సిఫార్సులను సూచించేందుకు ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రాతో కూడిన వన్‌మ్యాన్ కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ అనేక అంశాలను పరిశీలించి, రాష్ట్రంలోని పలు ఉప వర్గాల సంక్షేమాన్ని పరిరక్షించేలా స్పష్టమైన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది. అందులో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి రెల్లిస్ కాలనీ ప్రజలను, అంగన్వాడి, హైస్కూల్, స్వయం సహాయక బృందాల జీవనోపాధిని శుక్రవారం పరిశీలించింది. రెల్లిస్ కాలనీలో ఎస్‌సి ప్రజలు నివసిస్తున్న ఇళ్లను, చేస్తున్న వృత్తులు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి స్కూల్ పిల్లలు వాళ్లకు అందిస్తున్న పోషకాహారాలు, వారి ఎత్తు బరువు, అంగన్వాడీలో కల్పించిన వసతులు పరిశీలించారు. పటమటలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధాన ఉపాధ్యాయురాలతో మాట్లాడి చదువుతున్న ఎస్‌సి పిల్లల జనాభా, వారి పురోగతి వారికి కల్పిస్తున్న భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు. 9వ తరగతి పిల్లలతో వారు చదువుతున్న పాఠ్యాంశాన్ని చెప్పమని వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై ఆశలు

డిపిఆర్‌కే కేంద్రం నిధులు కేటాయించింది. తాజాగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాల్సి ఉంది. 216 జాతీయ రహదారి కత్తిపూడి-ఒంగోలు, 216 హెచ్ పెడన-నూజివీడు విస్తరించడానికి డిపిఆర్‌లు సిద్ధమవుతున్నాయి. రహదారుల విస్తరణ, నూతన రైల్వే ప్రాజెక్టు తదితర మౌలిక వసతులు కల్పనతో బందరు ఓడరేవు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటవుతాయని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. నాగాయలంక మండలం గుల్లలమోద వద్ద మిస్సైల్ లాంఛింగ్ కేంద్ర నిర్మాణానికి ఏడేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ పూర్తి చేసింది. భూములను కేంద్రానికి అప్పగించింది. నిధులు విడుదలపై నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు ముందుకు సాగలేదు. కేంద్రం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుల పూర్తికి నిధులు విడుదల చేయాల్సి ఉంది. ఈ ప్రాంత పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని చెబుతున్న చెన్నై-కోల్‌కత్తా పారిశ్రామిక కారిడార్‌లో మచిలీపట్నంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలను ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

తహశీల్దార్, విఆర్‌ఒలకు రిమాండ్

ప్రజాశక్తి-కంచికచర్ల: పాస్ పుస్తకం మంజూరు కోసం రూ.30 వేలు డిమాండ్ చేసి ఎసిబికి పట్టుబడిన కంచికచర్ల తహశీల్దార్ పి.జాహ్నవి, విఆర్‌ఒ రామారావులకు కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. బుధవారం తహశీల్దార్ కార్యాలయంపై దాడులు నిర్వహించిన ఎసిబి అధికారులు గురువారం ఉదయం ఆరు గంటల వరకు కంచికచర్ల తహశీల్దార్ కార్యాలయంలోనే విచారణ కొనసాగించారు. అనంతరం ఇద్దరిని విజయవాడ ఎసిబి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం తహశీల్దార్, విఆర్‌ఒలను విజయవాడ సబ్ జైలుకు తరలించినట్లు ఎసిబి అధికారులు తెలిపారు.

కబేళాను అభివృద్ధి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ



కబేళను మరింత అభివృద్ధి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం తన పర్యటనలో భాగంగా ఎంజీ రోడ్, కబేళ, వైవిఆర్ ఎస్టేట్, అజిత్ సింగ్ నగర్ ప్రాంతాలన్ని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కబేళాను మరింత అభివృద్ధి చేయాలని, నిత్యం వ్యర్థ నిర్వహణ చేస్తుండాలని అన్నారు. 58వ డివిజన్లోని వైవిఆర్ ఎస్టేట్లో నిర్మాణం దశలో ఉన్న 1500 కిలోలీటర్ల ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అమృత్ పథకం 2.0 లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీస్ డాక్టర్ సురేష్‌బాబు, ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు భారం

ఫీజు 0.5 శాతం చెల్లించాలి. భూముల విలువ పెరగడంతో రిజిస్ట్రేషన్ ఫీజులు భారంగా మారనున్నాయి.

రిజిస్ట్రేషన్ల భారం ఇలా

పెడన సబ్ రిజిస్ట్రార్ బలిపర్రులో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ విలువ ఎకరం 8.40 లక్షలు. ఇక్కడ ఇప్పటి వరకు సేల్ డీడ్‌కు 6.5 శాతం స్టాంప్ డ్యూటీ, ఒకశాతం ఫీజు చొప్పున రూ.63 వేలు చెల్లిస్తున్నారు. తాజాగా భూమి విలువ రూ. 10 లక్షలకు పెంచారు. రూ. 75 వేలు చెల్లించాలి. రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.12 వేలు పెరిగాయి. మొవ్వ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోని చిట్టూర్పులో వ్యవసాయ భూమి విలువ రూ. 12 లక్షలకు సేల్ డీడ్‌కు రూ.90 వేలు ఫీజులు చెల్లిస్తున్నారు. తాజాగా రూ.13.80 లక్షలకు భూమి విలువ పెరిగింది. దీన్ని పరిగణలోకి తీసుకుంటే ఫీజులు రూ.1.03,500 చెల్లించాలి. రిజిస్ట్రేషన్‌లు చేయించుకునేవారికి ఇకపై రూ. 13,500 అదనపు భారం పడుతోంది. 2.5 శాతం చొప్పున గిఫ్ట్ డీడ్‌కు ఇప్పటి వరకు రూ.30 వేలు చెల్లిస్తుండగా, ఇకపై 34,500 ఫీజు చెల్లించాలి. గిఫ్టుడీడ్ రిజిస్ట్రేషన్ ఫీజుకు రూ.4,500 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా 13 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో పెరిగిన విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు భారంగా మారనున్నాయి.

పట్టణవాసులకు పన్నుపోటు

గత వైసిపి ప్రభుత్వం నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో విలువ ఆధారిత పన్ను విధానాన్ని తీసుకు వచ్చింది. రూ.లక్ష రూపాయల విలువున్న ఆస్తికి 0.15 శాతం చొప్పున రూ.150 ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. తాజాగా పెరిగిన విలువకు అనుగుణంగా 2025-26ఆర్థిక సంవత్సరంలో పట్టణాల్లో ఆస్తి పన్ను డిమాండ్ పెరుగుతుంది. మచిలీపట్నం నగర పాలక సంస్థలో 8, 9, 10, 12 డివిజన్‌లలో గజం విలువ రూ.13,500 నుంచి 14,500కు పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 100 గజాలకు రూ.2,025 చెల్లించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరో రూ.150 పెంచి రూ.2,175 చెల్లించాల్సి ఉంటుంది. 19, 20, 28 డివిజన్‌లలో గజం రూ.8,500 ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 100 గజాలకు ఆస్తి పన్ను రూ.1275 చెల్లించారు. ఆస్తి విలువ ఈ డివిజన్‌లలో రూ.10 వేలకు పెంచడంతో రాబోయే ఆర్థిక సంవత్సరంలో రూ. 1500 చెల్లించాల్సి ఉంటుంది. రూ. 225 వరకు భారం పడుతుంది. జిల్లాలోని మచిలీపట్నం నగరపాలక సంస్థలో 48,272, తాడిగడప మున్సిపాల్టీలో 44,671, గుడివాడలో 26,258, వుయ్యూరులో 9,900, పెడనలో 7,227 చొప్పున మొత్తం 1,36,328 ఎస్సెస్‌మెంట్లున్నాయి. దీనికిగానూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 39 కోట్ల 64 లక్షలు పన్ను డిమాండ్‌గా ఉంది. తాజాగా ఆయా పట్టణాల్లో ఆస్తి విలువ పెరగడంతో రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరో రూ. 6 కోట్ల నుంచి రూ. 8 కోట్ల వరకు పన్ను డిమాండ్ పెరుగుతుందని అంచనా.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి : పెరిగిన ఎరువుల ధరలతో రైతులు ఇబ్బందులుపడతారని, వెంటనే పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు అజయ్ ఘోష్ అన్నారు. బంటుమిల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20:20, ఇతర ఎరువుల ధరలు వంద రూపాయలపైగా పెంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ఒకపక్క యూరియా కొరత, ఒకపక్క రాష్ట్రప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. వెంటనే పెంచిన ఏరువులు ధరలు తగించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యన్ని కొనుగోలు చేయాలనీ, రైతులకు రుణమాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి వీరబాబు, సుజ్ఞానం జనార్ధనరావు, గొట్టిపాటి గంగాధర్ పాల్గొన్నారు



పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కంకిపాడు : కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి, ఉద్యాన శాఖ అధికారి చందు జోసఫ్ సుందరం, పెనమలూరు మండలంలోని గోశాల, వణుకూరు గ్రామాల్లో ఉన్న పూల తోటలు, మిరప, ఆయిల్ ఫామ్ తోటలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి పూల తోటలో ఆకు మచ్చ తెగులు, చీడపీడల యాజమాన్యం, మిరప తోటలో నల్ల తామర పురుగు సమస్య, పామ్ ఆయిల్‌లో గానోడెర్మా తెగులు ఉండటం గమనించి రైతులకు సూచనలు చేశారు. బంతి తోటల్లో ఆకు మచ్చ తెగులు గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు వస్తుందని, దీని నివారణకు బ్లైటాక్స్, బావిస్టిన్, క్లోరోతలోనిల్ రెండు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో చాముండేశ్వరి పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పారిశుద్ధ్య నిర్వహణ, తడి పొడి చెత్త సేకరణపై నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల ఆకస్మిక తనిఖీ, పర్యవేక్షణలో భాగంగా వరుసగా శుక్రవారం కూడా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెల్లవారు జామునే తనిఖీలు నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్ లో (రాజుపేట, నేషనల్ కాలేజీ రోడ్డు, నాగ పోతురాజు సెంటర్, డంపింగ్ యార్డ్ ప్రదేశాలలో) ఆకస్మిక తనిఖీలు చేసి పారిశుద్ధ్య నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పలుచోట్ల తడి పొడి చెత్త వేరు చేయకుండా ఒకే డస్ట్ బిన్ లో వేయడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసి స్వయంగా అవగాహన కల్పించారు. అధికారులు కూడా ప్రజలకు తడి,పొడి చెత్త పై అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ ఇంటింటికి వెళ్లి నివాసితులతో మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పారిశుద్ధ్య నిర్వహణ ప్రత్యేక నోడల్ అధికారులు గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల కు చెందిన అయినపూడి వెంకటరామయ్య- విశాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆదర్శ రైతు అయినపూడి విజయ కుమార్, కుటుంబ సభ్యులు ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా రూ.50 వేలు విలువ కలిగిన 8 సిమెంట్ బల్లలను ఘంటసాల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఘంటసాల ఘోటకం కాలనీలో 2 సిమెంట్ బలలు, స్థానిక రుద్ర భూమి వద్ద 2 సిమెంట్ బల్లలు, పెన్నేరమ్మ గుడి వద్ద 1 సిమెంట్ బల్ల, జగనన్న కాలనీలో 1 సిమెంట్ బల్ల, ఘంటసాల -పిడుగువానిపల్లి సమీపంలోని పొలాలలో రైతులకు ఉపయోగపడేలా 2 సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. సిమెంట్ బల్లలకు రంగులు వేయించి తీర్చిదిద్దారు.




4వ తేదీలోపు వేతనాలు చెల్లించకుంటే సమ్మె

ప్రజాశక్తి - గుడివాడ : ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, శానిటేషన్ మహిళా పారిశుద్ధ్య కాంట్రాక్టర్ గత 2 నెలల జీతాలు, 3సం॥ల పిఎఫ్‌లు ఫిబ్రవరి 4లోపు చెల్లించకుంటే నిరవధిక సమ్మెను చేస్తామని ఏఐటియుసి గౌరవ అధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు, కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, ఎన్‌జివోస్ గుడివాడ తాలుక యూనిట్ కార్యదర్శి గోగులమూడి రాజేంద్రలు హెచ్చరించారు. శుక్రవారం అన్నే నరసింహారావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద ఏఐటియుసి అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, శానిటేషన్ మహిళా కార్మికులు 2నెలల జీతాలు, గత 3సం॥లుగా పిఎఫ్‌లు విషయమై చర్చలకు వచ్చిన జిల్లా డిసిహెచ్‌ఎస్ డా॥ జయరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవితో ఏఐటియుసి, ఎన్‌జివో నాయకులు చర్చలు జరిపారు. 4లోపు కార్మికులకు జీతాలు, ఫిఎఫ్ బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని లేని పక్షంలో సమ్మె చేస్తామన్నారు. వడ్డాది రమణమ్మ, కనుమూరి విజయలక్ష్మీ, వేల్పుల ధనలక్ష్మీ, మాతంగి మేరిమ్మ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కార్మికులు

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



మోపిదేవిలో...



అవనిగడ్డలో...

ప్రజాశక్తి-మోపిదేవి : ఆర్యవైశ్యుల ఆరోగ్య దైవం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం వేడుకలు శుక్రవారం మోపిదేవి రామకష్ణ గ్రాండ్‌లో ఘనంగా జరిగాయి. మోపిదేవి దేవాలయానికి వచ్చే భక్తుల వసతి సముదాయం రామకృష్ణ గ్రాండ్ వ్యవస్థాపకులు విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా నేత్రుత్వంలో మోపిదేవికి చెందిన తారక రామారావు రాజ్యలక్ష్మి దంపతులు అమ్మవారి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వాసవి మాతా సహస్ర స్తోత్రం పఠించారు. రమేష్, గానుగ చినరాజబాబు, పెదరాజబాబు, లోకేష్, రామకష్ణ, గ్రాండ్ సిబ్బంది ఓలేటి మాధురి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- చల్లపల్లి : వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం చల్లపల్లిలో ఘనంగా జరిగింది.కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపం అధ్యక్షులు కొల్లిపర నాగ పోతరాజు (మధు), కార్యదర్శి అన్నవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపం అధ్యక్షులు కొల్లిపర నాగ పోతరాజు (మధు), శ్రీ ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి వరదా హరిగోపాల్, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శోభాయాత్ర కార్యక్రమం పురవీధులలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరాగా జై వాసవి జై జై వాసవి నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుడివాక శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్మికుడు మృతి



మృతుడు లక్ష్మయ్య

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని కొడాలి-వేములపల్లి గ్రామాల మధ్య గుండేరు వంతెనపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామానికి చెందిన చౌటూరి లక్ష్మయ్య(22) మొవ్వ పంచాయతీలో సుమారు నాలుగు నెలలుగా పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తు న్నాడు. విధులు ముగించుకొని గురువారం రాత్రి యార్లగడ్డలో ఉంటున్న కుమార్తె దగ్గరకు ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా కొడాలి - వేములపల్లి గుండేరు వంతెనపై ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తగలడంతో పడిపోయిన లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ నుంచి మచిలీపట్నం వెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ మరణించారు. మతుడు లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

అగ్నిప్రమాదంలో ఏడు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-చల్లపల్లి : మొవ్వ మండలం కోసూరులో శుక్రవారం గ్యాస్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు నివాస గృహాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన బోగెం ఏడుకొండలు, నల్ల పోతుల రాములమ్మ, బోగెంబాలకష్ణ, బోగెంచింతయ్య, ఆవులపెదవెంకమ్మ, ఆవుల కోటేశ్వరరావు, ఆవుల వాసులకు చెందిన గృహాలు కాలిపోగా వారు నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న మొవ్వ అగ్రిమాపక కేంద్ర అధికారి కొణతం వెంకటేశ్వరరావు సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు. ఘటన స్థలాన్ని తాసిల్దార్ కే మస్తాన్ పరిశీలించి నిరాశ్రయులకు తక్షణసాయంగా బియ్యం, నిత్యవసరాలు, రెండు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. సంఘటన స్థలాన్ని గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్, కార్యదర్శి ఎంఎన్ ఎస్ మూర్తి సందర్శించారు.

ప్రభుత్వం గృహాలు నిర్మించి ఇవ్వాలి : సిపిఎం

అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన పేదలకు ప్రభుత్వం వెంటనే సహాయం అందించాలని మొవ్వ మండల సిపిఎం కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పేదలందరికీ ప్రభుత్వమే గహాలు నిర్మించి యివ్వాలని కోరారు.

శ్రీనివాసరావు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధైన సమాచార శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది సేవలు అత్యంత కీలకమని.. సుదీర్ఘకాలం పాటు సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి డివిజనల్ పీఆర్‌వోగా పదవీ విరమణ చేసిన సుంకర శ్రీనివాసరావు అందించిన సేవలు నేటితరం అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.సమాచార, పౌర సంబంధాల శాఖ కష్ణా జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డివిజనల్ పీఆర్‌వోగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సుంకర శ్రీనివాసరావు దంపతులను శుక్రవారం జిల్లా కలెక్టర్ బాలాజీ కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సత్కరించి, అభినందించారు. తొలుత జిల్లా కోర్టు సెంటర్‌లో గల విజయశ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన శ్రీనివాసరావు అభినందన వీడ్కోలు సభలో డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వోలు జి.రాజేష్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.




ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 -25లో

ఆర్‌కె కళాశాల విజయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆర్కే కళాశాల విద్యార్థులు 27వ స్టేట్ లెవెల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024-25 జనవరి 28, 30 తేదీల్లో విశాఖపట్నం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో జరిగిన వివిధ పోటీల్లో పురుషుల కబడ్డీ పోటీలో పాల్గొన్న 13 జిల్లాల జట్లు మీద జరిగిన పోటీలో ఆర్కే కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య ఈ కార్యక్రమంలో కళాశాల కబడ్డీ జట్టును అభినందిస్తూ ఈ సంవత్సరం నుంచి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారు నేషనల్ గేమ్స్ కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఆ టీంలో కూడా కళాశాల విద్యార్థులు ఎక్కువగా ఉండేలా ఆడారని అక్కడికి కూడా కళాశాల పేరు నిలిచేలా ఆడాలని ఆకాంక్షించారు. క్రీడల్లో విద్యార్థులను తయారు చేయించడానికి వెనుక ఉండి నడిపిస్తున్న మేనేజ్‌మెంట్ ఛైర్మన్ మద్దులూరి మాలకొండయ్యకి, సెక్రటరీ డాక్టర్ మద్దులూరి మహేంద్రనాథ్‌కి, ట్రెజరర్ అయిన మద్దులూరి గౌరీ అమర్నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించిన కళాశాల వ్యాయామ అధ్యాపకులు వివి మురళీనాథ్ యు శివశంకర్, మల్లికార్జున సింగ్‌లకు అభినందనలు తెలిపారు.

హీరో హోండా డెస్టినీ 125 ఆవిష్కరణ



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వాహన రంగంలో తనదైన ముద్ర వేసిన హీరో మోటార్స్ తన నూతన వేరియంట్ డెస్టినీ 125ను సరికొత్త మోడల్‌తో అందు బాటులో కి తీసుకువచ్చిందని హీరో మోటార్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ నేషనల్ హెడ్ సంజయ్ షెజ్వల తెలిపారు. బందర్‌రోడ్‌లోని ఆర్ఎం హీరో మూడు వేరియంట్లతో నూతన డెస్టినీ 125ను లంచ్ చేసిందని వాహన ప్రియులు, నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బందరు రోడ్డులోని ఆర్ఎం హీరో షో రూమ్ ఆధ్వర్యంలో పివిపి మాల్‌లో హీరో డెస్టినీ 125 స్కూటర్ లాంచింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హీరో మోటార్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ నేషనల్ హెడ్ సంజయ్ షెజ్వల, ఆంధ్రప్రదేశ్ హీరో మోటార్ ఏరియా సర్వీస్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొని ఆర్ఎంమోటార్ నిర్వాహకులు, సిబ్బందితో కలిసి కస్టమర్ల సమక్షంలో డెస్టినీ 125 స్కూటర్ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సంజయ్ షెజ్వల మాట్లాడుతూ డెస్టినీ 125 ఇప్పుడు మూడు రకాల వేరియంట్లు వీఎక్స్, జెడ్ ఎక్స్, జెడ్ ఎక్స్ ప్లస్‌లతో ఇది అందుబాటులో ఉందని తెలిపారు. డెస్టినీ 125 వాహనాలను నూతన అత్యాధునిక హంగులతో మార్కెట్ లోకి విడుదల చేశామన్నారు. ఈ నూతన వాహనం భద్రత, మైలేజ్ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందిస్తుందని అన్నారు. అనంతరం ఆర్ యం హీరో షోరూం మేనేజర్ అంజిబాబు మాట్లాడుతూ ఈ నూతన డెస్టినీ 125 కుటుంబ సమేతంగా ప్రయాణించేందుకు అనుకూలంగా రూపొందించబడిందన్నారు. ఈ వాహనం 125 సిసి సెగ్మెంట్లో 59 ప్రతి లీటర్ పెట్రోల్‌కు కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని, పొడవైన సీట్‌తో విశాలమైన డిక్కీ స్పేస్ లభిస్తుందని, ఇల్యూమినేటెడ్ స్టార్ట్ బటన్, ప్రొజెక్టర్ ఎల్ఈడి విత్ డిఎల్ఆర్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఈ వాహనంలో ఉన్నాయని తెలిపారు. ఈ వాహనాన్ని డెస్టిని 125 వియెక్స్ డెస్టిని 125 జెడ్ ఎక్స్, డెస్టినీ 125 జెడ్ ఎక్స్ ప్లస్ మూడు మోడల్లలో మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపారు. కావున నగరవాసులు తమ షోరూమ్‌ను సందర్శించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టరు ఆవిష్కరణ



ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో సింహపురి జిల్లా నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సిపిఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసగిస్తున్నాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసగించడం ముఖ్యమంత్రికి తగదన్నారు. ఆరు నెలలోనే 16 వేల కోట్లు విద్యుత్ భారాలు మోపి చరిత్ర తిరగరాసారని ఎద్దేవా చేశారు. తల్లి దీవెన లక్షలాది మంది విద్యార్థులకు ఈ ఏడాది అమలు చేయకుండానే వంచించారన్నారు. ప్రతి నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ 100 పడకల ప్రభుత్వ వైద్యశాల మాటలు విజయవాడ పశ్చిమ నగరంలో గడప దాటడం లేదన్నారు. జాబు కల్పించలేని యువతకు ప్రతి నెల 3వేల నిరుద్యోగ భృతి, విఎంసిలో 3 వేల పోస్టులు ఏమయ్యాయన్నారు. పేదవాడి సొంతింటి కల వాయిదాల పర్వం ఇంకెన్నాళ్లని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి ప్రజాస్వామ్య హక్కులు లౌకిక విధానం కోసం మహాసభల్లో చర్చించి ప్రజా ఉద్యమాలను రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఆదిలక్ష్మి కె.సూరిబాబు నగర కమిటీ సభ్యులు జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయాలి : విష్ణు



విజయవాడ : సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం సమాధి చేసిందని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోను తూచా తప్పకుండా అమలు చేయవలసిన బాధ్యత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ఉంటుందని.. అలా 99.4 శాతం హామీలను అమలు పరిచిన ఘనత రాష్ట్ర చరిత్రలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే చెల్లిందని మల్లాది విష్ణు అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్య, విజ్ఞప్తులన్నింటినీ.. అధికారంలోకి వచ్చిన వెనువెంటనే సంక్షేమ క్యాలెండర్ ద్వారా వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిష్కారం చూపారన్నారు. ఏ మాసంలో ఏ రోజున ఏ పథకం అమలు చేస్తామో ముందుగా ప్రకటించి మరీ అమలు పరిచామని.. ప్రతి ఒక్క ప్రభుత్వ కార్యాలయంలోనూ సంక్షేమ క్యాలెండర్ ను ప్రదర్శించి తమ నిబద్ధతను చాటుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాదీవెన కింద రూ.2,800 కోట్లు, వసతిదీవెన కింద రూ.1100 కోట్ల స్కాలర్ షిప్.. రెండూ కలిపి దాదాపు రూ.3,900 కోట్ల బకాయి పడిందని పేర్కొన్నారు. దీంతో కొన్ని చోట్ల కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను క్లాస్‌లకు రానివ్వడం లేదని, మరికొన్ని చోట్ల సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నేపథ్యంలో విద్యార్థులకు అండగా ఫిబ్రవరి 5న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 'ఫీజుపోరు' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. ఆరోజు ప్రతి జిల్లా కేంద్రంలో వైసీపీ నేతలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి వెళ్లి కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వబోతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, నాయకులు యరగొర్ల శ్రీరాములు, హఫీజుల్లా, అలంపూర్ విజయ్, జగదీష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి.లక్ష్మణరావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి.లక్ష్మణ రావు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, ఆటోకి సంబంధించిన పత్రాలు కలిగి ఉండటమే కాకుండా ఖాకీ దుస్తులు విధిగా ధరించాలన్నారు. ఎక్కడబడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, ఆటోల్లో పరిధికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు. మద్యం తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులు ఆటోల్లో మర్చిపోయిన వస్తువులు దగ్గరలోని పోలీస్ స్టేషన్ అందజేయాలి లేదా 112కి కాల్ చేసి తెలపాలని చెప్పారు. మైనర్లకు అద్దె ఆటోలు ఇచ్చే ఓనర్ల పైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా నిలపకుండా వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్క డ్రైవర్ పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్, ఆటో యూనియన్ నాయకులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బి.లక్ష్మణరావు

కరాటేలో దామినికి మూడు బంగారు పతకాలు

విజయవాడ : జాతీయ కరాటే పోటీల్లో కలతోటి దామిని మూడు గోల్డ్ పతకాలు, ఒక సిల్వర్, ఒక రజత పతకాలు సాధించినట్లు కోచ్ అంకమరావు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు హైదరాబాద్‌లో విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలో జాతీయ కరాటే వివిధ విభాగాల్లో పాల్గొని 5 పతకాలు సాధించింది. వాటిలో మూడు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్, ఒక రజత పతకం గెలిచినట్లు తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో దామిని ప్రతిభ కనబర్చడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. విద్యార్థిని అక్కడ కూడా రాణించి పతకాలు సాధించడంతో ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. దామిని విజయవాడలోని డాన్ బోస్కో స్కూల్‌లో 8 వ తరగతి చదువుతోంది. తండ్రి రమేష్ బాబు మెడికల్ రంగంలో పని చేస్తుండగా, తల్లి స్నేహలత అధ్యాపకురాలుగా పని చేస్తున్నారు. కోచ్ అంకమరావు ఆధ్వర్యంలో పాల్గొన్న క్రీడాకారులు 47 పతకాలు సాధించారు.





పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గంపలగూడెం : తునికిపాడులో శుక్రవారం పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు ఆ శాఖ వైద్యులు, సాయి కృష్ణ, అభిలాష్ తెలిపారు. ఈ శిబిరంలో 29 గేదెలకు సూడి పరీక్షలు, 43 గేదెలకు కృత్రిమ గర్భధారణ, 79 ఆవులకు వ్యాక్సిన్, గొర్రెలు, మేకలు, కోళ్ళ, కుక్కలు తదితరాలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేశారు. 58 మంది రైతులకు గాను 1,434 శాల్తీలకు చికిత్స నిర్వహించినట్లు వైద్యులు వివరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. పట్టణంలోని శాంతినగర్ 11 కెవి ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ ఉందన్నారు. విజ్ఞాన్ నగర్, కనపర్తి నగర్, శాంతినగర్, విష్ణుప్రియ నగర్ ఈ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రావిరాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని రవిరాల గ్రామంలో ఆంజనేయ స్వామిగుడి దగ్గర మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో బార్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు అధ్యక్షతన స్ట్రీట్ చిల్డ్రన్స్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు, వృద్ధుల, బాలలకు సంబంధించిన చట్టాలపై, బాలవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎజిపిటిఎల్ నరసింహారావు, న్యాయవాదులు ఎం.ఆంజనేయులు, గోనెల వెంకటేశ్వర్లు, రాజు, కె.రత్నబాబు, పి.రవికుమార్, గ్రామ పెద్దలు చిరుమామిళ్ళ బాలకృష్ణ ప్రసాద్, గురువులు, పారా లీగల్ వాలంటీర్లు నరేష్, యమ్.మురళి, రవితేజ, యస్.నాగ కుమారి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సిపిడబ్ల్యుఎస్ స్కీమ్ పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం. కన్నమ నాయుడు సి పి డబ్ల్యు ఎస్ స్కీమ్‌లను శనివారం పరిశీలించారు. వత్సవాయి మండలంలోని ఇందుగపల్లి, జగ్గయ్యపేట మండలంలోని మల్కాపురం, తక్కెళ్లపాడులో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఇందుగపల్లిలోని పంపు రూమ్‌ను పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండల ప్రజా పరిషత్ జగ్గయ్యపేట కార్యాలయం తనిఖీలో భాగంగా రికార్డ్ రూమ్‌ను ఫైళ్లను పరిశీలించారు. వేదాద్రి గ్రామంలో గల గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్, విస్తరణాధికారి కె.పద్మవతి, పంచాయతీ రాజ్ ఎఇ కె.శ్రీనివాస్, మండల అధికారులు పాల్గొన్నారు.

బాలికల సబ్‌జోన్ ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యతో పాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారులుగా పేరు ప్రఖ్యాతులు గడించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆకు నూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెనమలూరు నియోజకవర్గ బాలికల సబ్ జోన్ ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం విద్యకే ప్రాధాన్యతనిస్తూ క్రీడలపట్ల ఆసక్తి కనపరచడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. క్రీడారంగానికి కూడా మంచి గుర్తింపు ఉంటుందని, ఉత్తమ క్రీడాకారులకు ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, వెలగపూడి వెంకటేశ్వరరావు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ శ్రీధర్, పాఠశాల హెచ్‌ఎం కొడాలి శ్రీరమ, జోన్డేమ్స్ అధ్యక్షరాలు ఎం దుర్గాభవాని, సెక్రటరీ మురళి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. క్రీడలకు హరివిల్లు అధినేత వేములపల్లి లక్ష్మణచౌదరి సహాయ సహకారాలు అందచేశారు.

విజేతలు వీరే : కబడ్డీ పోటీల్లో కంకిపాడు జడ్పీస్కూల్ విద్యార్థినులు ప్రథమ, ప్రొద్దుటూరు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఖో-ఖో మంతెన స్కూల్ ప్రథమ, పెనమలూరు ద్వితీయ, త్రోబాల్ గొడవర్రు, ఉయ్యూరు విద్యార్థినులు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. టెన్నికాయిట్లో గొడవర్రు ప్రథమ, కాటూరు ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్ మంతెన ప్రథమ, ఉయ్యూరు ద్వితీయ, సాఫ్ట్బాల్లో కంకిపాడు ప్రథమ, ఉయ్యూరు ద్వితీయ, వాలీబాల్లో ప్రొద్దుటూరు ప్రథమ, ఉయ్యూరు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు.



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన


ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జగనన్న కాలనీలలో త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో టి. విజయ సారథి కోరారు. మండలంలోని కవుతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం చేవేంద్ర రోడ్ లోని లేఔట్‌లను అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరితగతిన ఇల్లు పూర్తి చేసుకోవాలని కోరారు. నిర్మాణానికి కావలసిన ఏదైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని కోరారు. ఎటువంటి ఉన్నా సరే వెంటనే పరిష్కారం చేసి ఇళ్ల నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇంచార్జి కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :విశాఖ పట్నంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్, కంచరపాలెం వేదికగా గత నెల 28 నుండి 30 వరకు జరిగిన ఐపీఎస్ జియం 2024-25 స్టేట్ మీట్‌లో గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు బాలికల స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌తో పాటు ప్రథమ, ద్వితీయ మరియు తతీయ స్థానాలు సాధించారు. ఈ మీట్ లో పదమూడు జిల్లాల నుండి సుమారు 1400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడాస్ఫూర్తిని కూడా కలిగి ఉండాలని అన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణను అందించిన ఫీజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావుని, సహాయ ఫిజికల్ డైరెక్టర్ ఎమ్.భవదీప్, మెకానికల్ బ్రాంచ్ జూనియర్.ఇన్స్ట్రక్టర్ కె.పిచ్చయ్యలను పాలిటెక్నిక్ యాజమాన్య చైర్మన్ డా.వల్లూరుపల్లి నాగేశ్వరరావు , సెక్రటరీ, కరెస్పాండెంట్ వి.సత్యనారాయణ రావు తదితరులు అభినందించారు.

నాగేశ్వరరావు సేవలు అభినందనీయం



నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : అరజా నాగేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు.. పాగోలు పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు శుక్రవారం పదవి విరమణ సందర్భంగా పాగోలు గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాసరావు అధ్యక్షతన అభినందన సత్కార కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ నాగేశ్వరరావు గత 30 సంవత్సరాలుగా వక్కలగడ్డ, చల్లపల్లి, పాగోలు గ్రామ పంచాయతీలలో బిల్ కలెక్టర్ గా విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. చల్లపల్లి ఎంపీడీవో ఏవి. రమణ, చల్లపల్లి జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, ఈఓఆర్డి వి.రవిశంకర్, సూపర్నెంట్ అతావుల్లా, శ్యాంసన్, గ్రామ కార్యదర్శి పిట్టి రాంబాబు, చల్లపల్లి గ్రామ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామారావు, గ్రామ పెద్దలు వేమూరి రమేష్ బాబు, మేకా (పెద్దబ్బాయి) తదితరులు నాగేశ్వరరావు-శేషకుమారి దంపతులను సత్కరించారు.

సిపిఎం రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు ఎంఎన్‌బిఆర్ భవనంలో సిపిఎం రాష్ట్ర మహాసభల గోడ పత్రికను జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో ఫిబ్రవరి 1,2, 3 తేదీలలో జరుగుతున్నాయని అన్నారు. 2024 లో జరిగిన ఎన్నికల తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల రూపాలలో పేద ప్రజలపై అనేక భారాలు వేస్తున్నాయని, పెట్టుబడిదారులకు మాత్రం రాయితీలు ఇస్తున్నాయని ఆయన అన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి టి నరేష్, సభ్యులు సిహెచ్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

రోసిరెడ్డి మృతి తీరనిలోటు : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : రైతు సంఘం నాయకులు, వీరపనేని గూడెం మాజీ సర్పంచ్ బొమ్మారెడ్డి రోసిరెడ్డి భౌతికకాయానికి గ్రామంలో శుక్రవారం అంతిమయాత్ర జరిగింది. అంతకుముందు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, పార్టీ నాయకులు టీవీఎల్. స్వామి, అనుమోలు వెంకటేశ్వరరావు, ఉదయ భాస్కరరావు, సూరగాని సాంబశివరావు, మోటమర్రి నాగ బ్రహ్మాచారి తదితరులు రోసి రెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని జోహార్లు అర్పించారు. గ్రామ స్మశాన వాటికలో రోసిరెడ్డి భౌతిక కాయానికి అంతిమక్రియలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా జరిగిన సంస్మరణ సభలో వై.నరసింహారావు మాట్లాడుతూ.. పార్టీతోపాటు రైతు సంఘం అభ్యున్నతికి రోసిరెడ్డి జీవితాంతం పాటు పడినట్లు తెలిపారు. అటువంటి నాయకుడు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మోపిదేవి : దక్షిణ కాశీగా వెలుగొందుతున్న పెద్దకళ్లపల్లి గ్రామంలోని దుర్గానాగేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 26వ తేదీన జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో కె స్వాతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముందస్తు అంచనాలతో భక్తులకుఅన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్నాన ఘాటు వద్ద గజఈతగాళ్ళ ఏర్పాటు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అవనిగడ్డ డిఎస్‌పి విద్యశ్రీ, మోపిదేవి ఎండిఓ స్వర్ణ భారతి , తాసిల్దార్ శ్రీవిద్య ఎస్సై కె.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు రిపేరు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో హ్యాండ్ పంపు రిపేర్ చేయించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బర్రె లెనిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



వీధి బాలలకూ హక్కులుంటాయి : జడ్జి

ప్రజాశక్తి-గన్నవరం : వీధి బాలల దినోత్సవం సందర్భంగా దావాజీగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా సదస్సుశుక్రవారం జరిగింది. మండల లీగల్ సెల్ చైర్మన్ సీనియర్ జడ్జి కే.జయలక్ష్మి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దేశంలో సుమారు 10 లక్షల మంది వీధి బాలలు నిరాశ్రయులుగా ఉన్నారని, మన రాజ్యాంగం వీధి బాలలకు ప్రత్యేకమైనటువంటి హక్కులను కల్పిస్తుందని చెప్పారు. మన పరిసర ప్రాంతాలలో మీకు వీధి బాలలు తారసపడితే 15100 లేదా చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098 కు డయల్ చేసి వివరాలు తెలియజేయాలని అన్నారు. అలాగే పాఠశాల విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయంలో అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అటువంటి దారుణమైన పరిస్థితి మీకు ఎదురుపడితే ముందుగా మీ తల్లిదండ్రులకు, ఆ తర్వాత పాఠశాల ఉపాధ్యాయులకు గానీ గన్నవరం న్యాయ సేవాధికార సంస్థకు చిన్న పోస్ట్ కార్డు ద్వారా తమ దష్టికి తీసుకువచ్చిన తగు న్యాయం చేకూరుస్తామని వివరించారు. అలానే బాల బాలికలు బాగా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి ఎస్ ఆర్ కె.మూర్తి ఉపాధ్యక్షురాలు వై. ఆర్.శారద పారా లీగల్ వాలంటీర్స్ రామినేని రవిబాబు బోడపాటి రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

దేవాంగ సంక్షేమ సంఘం సమావేశం

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం మల్లవోలు గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సమావేశం జరిగింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్ ఇంటి వద్ద జరిగిన ఈ సమావేశంలో ఫిబ్రవరి16 ఆదివారం విజయవాడలో జరుగుతున్న నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం గురించి చర్చించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి దేవాంగులు సామాజికంగా, ఆర్థికంగా ,రాజకీయంగా బలపడడానికి ఏ రకమైనటువంటి కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంత ప్రసాద్,రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరు సుబ్రహ్మణ్యం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి శివ శంకరయ్య, ఏ రాజు అరుణ బాబు పాల్గొన్నారు.



బహుమతులందుకుంటున్న లేగదూడల సంరక్షకులు

లేగదూడల అందాల పోటీలు

ప్రజాశక్తి - చందర్లపాడు : కొడవటికల్లులోని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. పశు ఆరోగ్య శిబిరాలు, గొర్రెల, మేకల డెవర్మింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.హనుమంతరావు, నందిగామ డివిజన్ డిడి మోజెస్ వెస్లీ, ఏడి వెంకట్రావు, ఏడి కృష్ణమూర్తి, మండల పశువైద్యాధికారి పి.జ్యోతిబాబు డాక్టర్ ప్రదీప్ చంద్ర, డాక్టర్ నీరజ, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లేగ దూడల సంరక్షణ నట్టలనివారణ, వాటి ఆరోగ్య సంరక్షణపై రైతులకు సలహాలు సూచనలిచ్చారు. లేగ దూడల అందాల పోటీలో పాల్గొన్న రైతులకు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. లింగ నిర్ధారణ సెమెన్ ప్రాముఖ్యత గురించి సూడి పరీక్షలు, తిరగ బిర్లు, గేదెలు ఉచిత చికిత్స మొదలైన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు : భవన నిర్మాణం పని చేస్తూ పైనుండి జారిపడి తీవ్ర గాయాలు పాలైన కార్మికుడికి తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. తిరువూరు 15వ వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు కంటిపూడి వాసు ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్ర గాయాలతో లేవలేని పరిస్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించే వాసు మంచాన పడటంతో పూట గడవక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్ తన వంతు ఆర్థిక సహాయం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని వాసు కుటుంబానికి దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థిక సాయం 8367428320 నెంబరుకు ఫోన్ పే చేయాలని ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 9, 20 వార్డుల కౌన్సిలర్స్ మూడు దుర్గారావు, షేక్ అజీజ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - తిరువూరు : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతి ప్రదానం చేశారు. గాంధీజీ జీవిత చరిత్రపై తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇటీవల విద్యా ర్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు జంగాల మమురళీకృష్ణ, నాళ్ళ సురేంద్ర, పివి రావు, అర్పిత, సునీత, రాహుల్, రాము, స్కూల్ హెచ్ఎం పీ వి ఎస్ ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బత్తిన రామ్మోహన్‌రావు వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ : సింగ్‌నగర్ 59వ డివిజన్ సిపిఎం సీనియర్ నాయకులు బత్తిన రామ్మోహన్‌రావు (రాము) 10వ వర్ధంతి సింగ్ నగర్ లెనిన్ సెంటర్ లీలా సుందరయ్య భవనం వద్ద జరిగింది. రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడారు. బత్తిన రాము చివరి వరకు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేసిన వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాలివ్వాలని, సింగ్‌నగర్‌లో ఇళ్ల పట్టాల కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తూ కార్యకర్తలను ప్రోత్సహించే వారిని అటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరగబోయే పోరాటాలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 59వ డివిజన్ శాఖ కార్యదర్శులు ఎం.నాగార్జున, ఎన్.సన్యాసిరావు, సిపిఎం స్థానిక నాయకులు ఎ.పున్నారావు, పి.సాంబిరెడ్డి, పి.కృష్ణమూర్తి, జె.మంగపతి, ఎస్.కె.రషీద్, మౌలాలి ఎస్.కె సలీం, తదితరులు పాల్గొన్నారు.

పండు ఈగ నష్టం నివారణకు లింగాకర్షిక బుట్టలు

ప్రజాశక్తి - వత్సవాయి : మామిడి తోటలో పండు ఈగ నష్టం అధికంగా ఉండటం వలన లింగాకర్షిక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ అచ్యుత రాజ అన్నారు. డాక్టర్ .కే. ఎల్ రావు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వత్సవాయి మండలంలోని కన్నెవీడు గ్రామంలో వివిధ పంటలను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె. అచ్యుత రాజు మాట్లాడుతూ మామిడి తోటలో ప్రస్తుతం పూత, కోత దశలో ఉన్నందున గత సంవత్సరం పండు ఈగ నష్టం అధికంగా ఉండటం వల్ల ఈ సంవత్సరం మామిడి రైతు సోదరులందరూ తప్పనిసరిగా పండు ఈగకు సంబంధించిన లింగాకర్ష బుట్టలు ఎకరానికి 5 నుంచి 6 వరకు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పిందెలు బఠానీ సైజు వచ్చినప్పుడు క్లోరోఫైరీపాస్ 50శాతం ఇసి 2.5 మిల్లీ లీటర్ల అజాడిరెక్టిన్ లేదా 1500 పిపిఎం 3 మిల్లీ లీటర్ల లేదా మలాథియాన్ 2 మి.లీ చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కాయలు పెద్ద నిమ్మకాయ సైజుకు పెరిగిన తర్వాత ముదురు గోధుమ రంగు పేపరు కవర్లను పురుగు ఆశించడం నియంత్రదించడమే కాకుండా కాయలపై మచ్చలు లేకుండా మంచి రంగుతో నాణ్యమైన కాయలు రావడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ఇతర పంటలైన మొక్కజొన్న, వరి, వేరుశనగ వంటి పంటల్లో నత్రజని ఆశ్రయినంత మేరకు సిఫారసు చేసిన సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడి పంటలను ఆశించే పురుగులు, తెగలు ఉధృతిని తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్శనలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యులుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, కార్మిక ప్రజాసంఘాలు బలపరుస్తున్న పిడిఎఫ్ బలపరిచిన ఉద్యమ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ శుక్రవారం కండ్రిక 64, డివిజన్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ శాసనమండలిలో ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం గొంతెత్తి మాట్లాడిన వ్యక్తి కెఎస్ లక్ష్మణరావును ప్రథమ ప్రాధాన్యత ఓటు 1 పై వేసి గెలిపించాలని కోరారు. ఫిబ్రవరి 27న జరిగే ఓటింగ్‌లో పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొని ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీరాణి, సిఐటియు నాయకులు పి.వెంకట రెడ్డి, గ్రాడ్యుయేట్స్ ఓటర్లు పాల్గొన్నారు.

మైలవరం : కష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్స్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రజా సంఘాల బలపరిచిన కె. ఎస్ లక్ష్మణరావుని గెలిపించుకుందామని పలువురు ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్స్, కార్మిక, ప్రజాసంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశం శుక్రవారం సాయంత్రం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజల గొంతుక లక్ష్మణరావు అని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, అంగన్వాడి, ఆశ, పెన్షనర్స్, ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని బలపరుస్తున్న దృశ్యం

వినియోగదారుల పట్ల గౌరవంగా ఉండాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు అందజేసే సమయంలో వినియోగదారులతో గౌరవంగా ప్రవర్తించాలని గంపలగూడెం తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి చెప్పారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండియులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, సరుకులు 1వ తేదీ నుండి పూర్తిస్థాయిలో అందజేసే అంతవరకు పూర్తి సమయాన్ని కేటాయించాలని చెప్పారు. డీలర్లు ప్రత్యేకంగా ఆయా షాపుల వద్ద అందరికీ కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంలోనైనా చిన్నచిన్న సమస్యలు తలెత్తితే, తమ దృష్టికి తేవాలని వివరించారు. అంతే తప్ప వినియోగదారులకు సరుకు ఇవ్వకుండా ఉంటే ఊరుకోమన్నారు. పై విషయాలను గమనించి, ఎండియులు డీలర్లు పనిచేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ రాజకుమారి

నేరాల నియంత్రణకు చర్యలు : ఏసిపి

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :

నేరాల నియంత్రణకు ప్రభుత్వం అన్ని వర్గాల వారిని భాగస్వాములను చేస్తుందని ఏసిపి ప్రసాదరావు తెలిపారు. రెడ్డిగూడెం వివిధ వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు చేసిన వ్యక్తుల కదలికలను వెంటనే పసిగట్టి, సంతోషకరమైన సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖరరావు, స్థానిక ఎస్ఐ బి.రామ్మోహనరావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసిపి ప్రసాదరావు

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ : టిడిపి నాయకులు, ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు వడ్డెల్లి సాంబశివరావును జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను శుక్రవారం పరామర్శించారు. వడ్డెల్లి సతీమణి సరోజినీ దేవి ఇటీవల మరణించారనే విషయం తెలుసుకున్న సామినేని శుక్రవారం సాంబశివరావు గృహానికి వెళ్లి పరామర్శించి సానుభూతి తెలిపారు.

21వ వార్డు కౌన్సిలర్ రాజీనామా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

పట్టణ మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి కౌన్సిలర్ పదవికి, టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా పత్రాన్ని మున్సిపాల్ కమిషనర్ రామ్మోహన్‌రావుకు అందజేశారు. యూనిట్ 12 ఇన్చార్జి గెల్లా వైకుంటేశ్వరావు రాజీనామా చేశారు. ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్యకు రాజీనామా పత్రం అందజేశారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

విధులు బహిష్కరించి నిరసన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ, బంటుమిల్లిలో న్యాయవాదిపై పోలీసుల దురుసు ప్రవర్తనను నిరసిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పోలీసుల అక్రమ చర్యలను ముక్తకంఠంతో ఖండించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యర్రమాసు ధనుంజయుడు, గోనెల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ గౌడ్, జంగా నరసరాజు, ఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, తదితరులు

టిడిపి నాయకులు ధర్మాన సతీష్ మృతి

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ పట్టణం బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన టిడిపి నాయకులు ధర్మాన సతీష్(45) అనారోగ్యంతో మతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఎపి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు. జనసేన జిల్లా నాయకులు గుడివాడ సాంబశివరావు, నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, వైసిపి నాయకులు పరామర్శించారు.

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత

ప్రజాశక్తి-బంటుమిల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బంటుమిల్లిలో తెలుగు భాషో పాధ్యాయులుగా పనిచేసిన కీర్తిశేషులు మారుతి వెంకట సత్యనారాయణమూర్తి, సరళ అన్నపూర్ణల జ్ఞాపకార్థం వారి కుమారుడు కష్ణ ప్రసాద్ మూడు లక్షల రూపాయలను బ్యాంక్‌లో జమ చేశారు. దానిపై ప్రతి సంవత్సరం వచ్చే వడ్డీని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అందించాలని కోరారు. అలాగే అలాగే గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన హాసిని, శ్రీవల్లిలకు 18 వేల రూపాయలు నగదు పురస్కారాన్ని అందజేశారు.అలాగే పాఠశాలకు ఏడు వేల రూపాయలు విలువ చేసే పది కుర్చీలను అందించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు వీర వెంకటరావు, ఉపాధ్యాయ కార్యదర్శి గోపయ్య,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం పురుషోత్తపట్నం పంచాయతీలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. చిన ఆవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాదల రోహిణి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పేదలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వీటిని సద్విని యోగం చేసుకుని వైద్య సేవలు పొందాలన్నారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన తహశీల్దార్

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఫిబ్రవరి 27వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా వివిధ పార్టీల ప్రతినిధులతో తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. తాసిల్దార్ బి లోకరాజు ప్రతి నిధులతో ఎన్నికల విధి విధానాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ ప్రతినిధులు జంగం మోహనరావు, వల్లభనేని రంగబాబు, పరంధామయ్య, వైసిపి ప్రతినిధి కోటప్రోలు నాగు, బహుజన సమాజ్ పార్టీ వారా పాపారావు, సిపిఎం పార్టీ ప్రతినిధి పిడుగు దేవ సహాయం, సాయి పాల్గొన్నారు.

బైక్‌పై పర్యటిస్తూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక బంటుమిల్లి రోడ్డు, ఓల్డ్ బైపాస్‌రోడ్, పంచవటి కాలనీలలో ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో పంచవటి కాలనీవాసులు తెలిపిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బంటుమిల్లి రోడ్డులోని ఫిష్ మార్కెట్ మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తమ దష్టికి తీసుకురావాలన్నారు. ప్రజావేదిక కార్యాలయంలో అందుబాటులో ఉంటామని తెలిపారు.



ప్రజల వద్దకు వెళ్ళి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

102 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్,విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లి లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం నందు 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో భీమవరపు వారి అంకమ్మ గుడి దగ్గరఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె,మెదడు,నరముల, జనరల్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు.డాక్టర్ పి. బి.ప్రశాంత్ బాబు నరాల వైద్య నిపుణులు, డాక్టర్ బండారు అనూష గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి. చంద్రమోహన్ జనరల్ వైద్యులు రోగులను పరిశీలించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

విద్యార్థుల అల్పాహారానికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని పెంజెంద్ర జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంకాలం అల్పాహారం కోసం గ్రామ సర్పంచ్ రేమల్లె తాతబ్బాయి, మాజీ సర్పంచ్ బొప్పన శివప్రసాద్, జితేంద్ర లు ఆర్థిక వితరణ అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగబాబు తెలిపారు. పదవ తరగతికి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు ప్రైవేట్ క్లాసులను నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఈ అల్పాహారం ఏర్పా టుకు గ్రామస్తులు సహకరించడంతో వారికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దాతలకు అభినందనలు తెలిపారు.

అభినందన సభ

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : 37 సంవత్సరాలుగా వైద్య వత్తిలో ఎందరికో వైద్య సేవలు అందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన పీహెచ్‌ఎన్ కూనప రెడ్డి పద్మావతికి పీహెచ్సీ సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేశారు. డాక్టర్ సాయి ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అభినందన సభలో పద్మావతిని,భర్త వెంకటేశ్వరరావును పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. పలువురు సిబ్బంది ఆమె ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే సమయంలో చేసిన సేవలను, ఆమెకున్న ఓర్పు, సహనాన్ని, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించిన విధానాన్ని కొనియాడారు.

ఉచిత పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : మొవ్వ మండలం బార్లపూడి, గూడపాడు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాలలో పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు మందులను పంపిణీ చేశారు. మేకలు గొర్రెలు మరియు పాడి పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. బార్లపూడి పశు వైద్య శిబిరంలో పశు వైద్యులు సజన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. గూడపాడులో పశు వైద్య సిబ్బంది జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ జి . వెంకటయ్య పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో విఎల్‌వో వెలుగు రామకష్ణ, ఏ హెచ్ ఏ డి నరేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శనివారం హుండీలు లెక్కించారు. దేవదాయ శాఖ అధికారులు, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వ హణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

వట్టికొండ నాగేశ్వరరావు వర్ధంతి

ప్రజాశక్తి - వీరులపాడు : కమ్యూనిస్టు సిద్ధాంతాలు నేటికీ సజీవంగా ప్రజల్లో బలంగా ఉన్నాయంటే వట్టి కొండ అమరజీవి నాగేశ్వరరావు లాంటి నాయకుల పోరాట విధానాలే కారణమని సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. శుక్రవారం వీరులపాడు గ్రామంలో వట్టి కొండ నాగేశ్వరరావు (జగన్నాథం) 30వ వర్ధంతి కార్యక్రమాన్ని వీరులపాడు ఎంపీటీసీ మండూరి ప్రకాష్ రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరులపాడు గ్రామంలో మూడుబొమ్మల సెంటర్ వద్ద వట్టి కొండ జగన్నాథం, అంబేద్కర్ ,జగజ్జీవన్ రాయ్ విగ్రహాలకు పూలమాలలు వేసి గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి కంచికచర్ల : సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు పెట్టి ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కంచికచర్ల ఎస్సై బోనగిరి రాజు అన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టి ప్రజలను రెచ్చగొట్టే విధంగా చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పరిటాల కు చెందిన గొల్లపల్లి జమలయ్య అను వ్యక్తిని కంచికచర్ల పోలీసు వారు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీ కి పంపినట్లు తెలిపారు. కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావతం కాకుండా చూడాలన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టేవారు ఎంతటి వారైనా సరేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



విఘ్నేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.4,17,814

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం కానుకుల రూపంలో భక్తులు చెల్లించిన నగదును లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో, భక్తులు, ఉద్యోగులుచే లెక్కింపులో రూ.4,17,814 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), ధర్మకర్తల ఉత్సవ కమిటీ ఛైర్మన్ సాయన రాజేష్‌లు తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, కమిటీ సభ్యులు లోయ వాసు, పంచగుమర్తి శ్రీనివాసరావు, విక్కుర్తి పోతురాజు, శలంకాయల లీలాకుమారి, వీరమాచనేని శైలజ, పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ మానసిక ఆరోగ్యం ప్రదానం



ప్రజాశక్తి- మచిలీపట్నం రూరల్ : వ్యక్తికీ మానసిక ఆరోగ్యం అత్యంత ప్రధానం అని సైకాలజిస్ట్ డాక్టర్ బి. శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నిత్యం వారి విధుల్లో ఎదుర్కొంటున్న పని ఒత్తిడి దాని వలన వారి ఆరోగ్యాలలో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ,విద్యార్థుల్లో వచ్చే విద్యాపరమైన సమస్యలను అధిగమించడానికి వారికి మానసిక ఆరోగ్యం పెంపొందించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉపాధ్యాయులు వారి పనులు ఒత్తిడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిజిటిలు జాలాది సత్యనారాయణ,కిషోర్ కుమార్ గుప్తా, రేమ్య దినేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. .

సబ్‌రిజిస్ట్రారు అదనంగా ఫీజు వసూలు చేయడం తగదు : ఆళ్ల



వినతిపత్రం అందిస్తున్న ఆళ్ల

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలో ఉన్న వ్యవసాయ భూములకు మార్కెట్ విలువ పక్క గ్రామలతో పాటు కనీసం ఎకరానికి 30 లక్షల రూపాయలు తక్కువ కాకుండా పెంపుదల చేయాలని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు కానుమోలు సబ్ రిజిస్ట్రారు డి.జయరాజును శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ కానుమోలు సబ్ రిజిస్ట్రారు పనితీరు చాలా అధ్వానంగా ఉందన్నారు. ఉమ్మడి కష్ణాజిల్లా వ్యాప్తంగా లబ్దిదారులు రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రేషన్ వాల్యూమీద 6.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజుకింద ఒక శాతం యూజర్ చార్జీ మొత్తం కలిపి 7.5 శాతంతో రైతులకు ఇబ్బంది లేకుండా రాష్ట్ర ప్రభుత్వం క్రయవిక్రయాలు పారదర్శకంగా చేస్తుందన్నారు. కానీ కానుమోలు సబ్ రిజిస్ట్రారు జయరాజు కొంతమంది డాక్యుమెంట్ రైటర్లను ఒక ముఠాగా ఏర్పాటు చేసి లబ్దిదారుల నుంచి 1.5 శాతం అదనంగా మామూళ్ళ రూపంలో వసూలు చేసి మొత్తం రైతుల దగ్గర నుంచి వివరాలు చెప్పకుండా 9 శాతం వసూలు చేస్తున్నారన్నారు.



సత్యహరిశ్చంద్ర నాటిక ప్రదర్శన

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సహకారంతో – జై శబరీష కళా నాట్యమండలి ఆధ్వర్యంలో బలిజేపల్లి లక్ష్మీకాంతం విరచిత సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. శుక్రవారం రాత్రి స్థానిక కౌతా పూర్ణానందం హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. హరిశ్చంద్ర పాత్రలో బొర్రా నరేన్ (అడవి సీను), అగురు త్రినాథ్ నాయుడు (వారణాసి సీను), తూళ్లూరు వెంకయ్య (కాటిసీను), చంద్రమతిగా ఎన్.సత్యకుమారి, నక్షత్రకుడుగా పరదేశ్, శివశంకర్, కళాకౌశికుడుగా బి.సుబ్బారావు రాణించారు. సంగీతం ఎ.వై.దాస్ (హార్మోనిస్ట్), రాము (డోలక్) సహకరించారు. కార్యక్రమానికి సీనియర్ కళాకారులు దొంతాల ప్రకాష్, గుమ్మడి జీవన్ కుమార్, జి.వి.రంగారెడ్డి, మోడి ఆంజనేయులు, జి.సింహాచలం నాయుడు, ఎం.ఆంటోనీ, బి.నాగేశ్వరరావు, శ్రీనివాసనాయుడు, హెచ్‌విఆర్ఎస్ ప్రసాద్, కత్తి శ్యామ్ ప్రసాద్, ఈ రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.

స్టడీ అబ్రాడ్ ఫెయిర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహాత్మా గాంధీ రోడ్‌లోని డివి మానర్ హోటల్‌లో ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో మెగా స్టడీ అబ్రాడ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసారు. 30 విశ్వవిద్యాలయాలు ఈ ఫెయిర్‌లో పాల్గొన్నాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫెయిర్‌లో పాల్గొని విదేశాల్లో ఉన్న విశ్వవిద్యాలయాలు, అక్కడ అందిస్తున్న కోర్సులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌ల వివరాలు, వీసా, వసతి సౌకర్యాలు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ కేచిత్ గోయల్ మాట్లాడుతూ ఫెయిర్‌లో స్టూడెంట్స్‌కి విదేశాల్లో ఉన్నత విద్య అవకాశాలు, స్కాలర్ షిప్స్, కెరీర్ అవకాశాలు, స్టెమ్ ప్రోగ్రామ్స్ తెలిపినట్లు తెలిపారు. 30 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు ఫెయిర్‌లో పాల్గొన్నాయన్నారు. విదేశాల్లో విద్యను అభ్యసించాలనుకునే వారి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. వన్‌స్పాట్ సొల్యూషన్‌గా యూనివర్సిటీ సెలక్షన్ నుంచి వారి వీసా ప్రాసెస్ వరకు అన్ని చేస్తామన్నారు. ఐఇఎల్ఎస్ కోచింగ్ కూడా ఇస్తామని, విద్య రుణాలు ఇప్పిస్తామని, వీసా వచ్చి అక్కడికి వెళ్లేవరకూ వారికి సపోర్ట్ చేస్తామని అన్నారు. సంస్థ విజయవాడ సెంటర్ మేనేజర్ వై.ప్రశాంత్ మాట్లాడుతూ ఈ ఫెయిర్‌లో 400 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారని అన్నారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఫిబ్రవరి 1 నుంచి 14 వరకు అప్లికేషన్ వీక్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆఫీస్ కు వచ్చి అప్లికేషన్స్ పూర్తి చేసుకొని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

విజయవాడ : రాజధాని అమరావతిలోని రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి ఏపీ సీఆర్డీఏ, కమిషనర్ కె.కన్నబాబు సూచన మేరకు 'గ్రీవెన్స్ డే' నిర్వహించారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ



ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు, రైతు కూలీలు పాల్గొని వారి ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. గ్రీవెన్స్ డేలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కే.ఎస్.భాగ్యరేఖ, పి.పద్మావతి, కె.స్వర్ణమేరి, బి.శ్రీనివాస నాయక్, ఏ.జి.చిన్నికృష్ణ, జి.భీమారావు, జి.రవీందర్, తహశీల్దార్లు, అధికారులతో కలసి రాజధాని రైతులు, రైతు కూలీల నుంచి అర్జీలు స్వీకరించారు.

సూత్రా వస్త్ర ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఇండియన్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ సూత్రా వివాహ కాలానికి ప్రత్యేక వస్త్రాలతో అద్భుతమైన వెడ్డింగ్ స్పెషల్ ఎడిషన్ విజయవాడ నగరానికి తీసుకువచ్చినట్టు నిర్వాహకులు చెప్పారు. నగరంలోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో సూత్ర ప్రదర్శన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ శేష సాయి కల్యాణ వేదిక లో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నమన్నారు. ఫ్యాషన్, జీవనశైలి ఉపకరణాలు, అద్భుతమైన పెళ్లి దుస్తులు, చక్కటి ఆభరణాలు, స్టైలిష్ ఉపకరణాలతో కూడిన ప్రత్యేక సేకరణలు అన్నింటిని ఒకే వేదికలో ప్రదర్శించేందుకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. భారతదేశం అంతటా నగరాల్లో ఎగ్జిబిషన్‌లను విజయవంతంగా నిర్వహించే గొప్ప వారసత్వంతో సూత్రా ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు, లైఫ్‌స్టైల్ బ్రాండ్‌లు విలాసవంతమైన కలెక్షన్‌లను ఒకచోట చేర్చి ఫ్యాషన్ అభిరుచి కలవారికి తాజా ట్రెండ్‌లు, ఆవిష్కరణలను సూత్రా అందిస్తుందన్నారు. వివాహ వస్త్రాలకు మరింత వైభవం చేకుర్చాలి అనుకుంటే, ఆభరణాల సేకరణను తాజా పర్చుకోవాలన్నారు. ప్రత్యేకమైన ఉపకరణాలను పొందాలి అనుకున్నా ఈ సూత్రా ప్రదర్శన తప్పక సందర్శించవలసినదిగా



కోరారు. సూత్ర ఎగ్జిబిషన్‌లో ప్రముఖ డిజైనర్స్ ఎత్నిక్ లుక్ (బెంగలూరు), యువర్ చాయిస్ (విజయవాడ) శ్రీ లక్ష్మి శారీస్, ఆర్యన్ క్రియేషన్స్, కోల్‌కతా శారీ హౌస్, సాయి బోటిక్ శారీస్ అండ్ డ్రెస్, శ్వేతా గుల్గియా, (కోల్ కతా), లక్నోవీ కుర్తీస్ అండ్ ప్లాజో, హేండ్ లూం డిజిటల్ ప్రింట్, తపస్వీ డిజైనర్స్ (ముంబాయి), సిమ్రాన్ డమ్ర, రిషాబ్ కలెక్షన్స్ (ఛత్తీస్గఢ్) తోపాటు మరికొన్ని సంస్థలు పాల్గొన్నాయన్నారు. సాంప్రదాయ, ఆధునిక, ఫ్యాషన్, ప్రత్యేక వివాహ దుస్తులు, గృహాలంకరణ, హ్యాండీక్రాఫ్ట్స్, ఇతర విభిన్న తరహా ఉపకారణాలు ఎగ్జిబిషన్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

గుణదల లూర్దుమాత నవదిన ప్రార్థనలు ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద కతోలిక పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, డయోసిస్ ఎడ్యుకేషన్ డస్క్ డైరెక్టర్ ఫాదర కొలడాని మరియన్న, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు తదితర గురువులు పుణ్యక్షేత్రం ప్రధాన చర్చివద్ద మరియమాత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలగతోటి జోసఫ్ రాజారావు యాత్రికులకు సందేశమిస్తూ జగద్గురువులు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ 2025 సంవత్సరాన్ని జూబ్లి సంవత్సరంగా ప్రకటించారన్నారు. దేవుని రక్షణ ప్రణాళికను కొనసాగించటానికి మరియమాతను దేవునితల్లిగా ఎన్నుకున్నారన్నారు. స్త్రీలందరిలో మరియమాత ధన్యురాలని తెలిపారు. ఈ సంవత్సరం జరిగే 101వ గుణదల మాత మహోత్సవాలు దిగ్విజయం చేయాలని కోరారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి మాట్లాడారు. అనంతరం వికార్ జనరల్ ఫాదర్ మేశపాం



గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, రెక్టర్ యేలేటి విలియం జయరాజు స్వామి, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు తదితర గురువులు దివ్యసత్ప్రసాద 'మందసంతో' కొండపై మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. అనంతరం లూర్జుమాత స్వరూపం వద్ద "సమిష్టి దివ్యపూజాబలి" సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొక్రెయిటర్ ఫాదర్ బొడ్డు ఆనంద్, ఫాదర్ యం.చిన్నప్ప, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ పసల తోమస్ తదితర గురువులు, సంఘ పెద్దల ప్రెసిడెంట్ నువ్వుల విజయరాజ్, కన్యాస్త్రీలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా

5న బడ్జెట్ కాపీలు దహనం

ప్రజాశక్తి - విజయవాడ : బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌కు నిరసనగా ఫిబ్రవరి 5న నిరసన ప్రదర్శనలు, బడ్జెట్ కాపీలు దహనం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్ర కార్మిక సంఘాల నాయకులు సమావేశం నగరంలోని హనుమాన్ పేట దాసరి భవనంలో జరిగింది. సమావేశంలో నాయకులు కార్మికుల ప్రదర్శన, నిరసన, బడ్జెట్ కాపీలు దహనం అంశాలపై చర్చించారు. ఫిబ్రవరి 5 శుక్రవారం ఉదయం 11గంటలకు గవర్నర్ పేట లెనిన్ సెంటర్లో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపొందించే ముందే ప్రభుత్వం రంగ సంస్థల పరిరక్షణకు బడ్జెట్ కేటాయింపులు, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, నిధులు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ తదితర అంశాలను కేంద్ర కార్మిక సంఘ ప్రతినిధులతో చర్చించి నిర్ణయాలు చేయవలసి ఉంది. అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు రూపొందించవలసి ఉంది. ఇందుకు విరుద్ధంగా బడా కార్పొరేట్ కంపెనీలకు, వారికి లాభాలు దోచిపెట్టేలా కార్మికులకు, యావత్తు దేశప్రజలకు పన్నుల భారాలు మోపేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని సమావేశానికి హాజరైన నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అనుకూల నీతిఆయోగ్ పెద్దలు, బడా కార్పొరేట్ ప్రతినిధులు, ఫిక్కీ లాంటి కంపెనీల అసోసియేట్ ప్రతినిధులతో రూపొందించబడిన బడ్జెట్ ఏ వర్గాలకు మేలు చేర్చుతుందో అంచనా వేయవచ్చని కార్మిక



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

నాయకులు చర్చించారు. అందుకే కార్మిక వ్యతిరేక, బడా కార్పొరేట్ కంపెనీల అనుకూల బడ్జెట్‌కు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఫిబ్రవరి 5న విజయవాడ లెనిన్ సెంటర్లో 200 మంది కార్మికులతో నిరసన చేపట్టాలని, బడ్జెట్ కాఫీలను దగ్ధం చేయాలని సమావేశానికి హాజరైన కార్మిక నాయకులు నిర్ణయం చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.వెంకట సుబ్బయ్య, జిల్లా నాయకులు సాంబశివరావు, నాగేశ్వరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు కె.దుర్గారావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, జిల్లా నాయకులు కొప్పుల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విదేశాలకు వెళ్లి విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఏజంట్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ సరైన మార్గదర్శకం చేసి, మంచి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, వసతి, స్కాలర్షిప్ల పొందేలా తోడ్పాటును అందిస్తుందని సంస్థ చీఫ్ గ్రోత్ ఆఫీసర్ కేచిత్ గోయల్ తెలిపారు. తమ సంస్థ ద్వారా అనేక మంది విద్యార్థులను విదేశీ విద్యకు వివిధ దేశాలకు పంపించినట్లు తెలిపారు. విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు పొంది, అక్కడ విద్యను అభ్యసించేందుకు అవసరమైన అన్ని సేవలను అందజేస్తామని తెలిపారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నందిగామ : అనధికారిక సిలిండర్లు వాడుతున్నారని వచ్చిన సమాచారంపై అధికారులు శుక్రవారం రైతుపేటలోని పలు హోటళ్లలో తనిఖీ నిర్వహించారు. అనధికారిక గ్యాస్ బండలను వాడుతున్న హోటల్ యజమానులపై కేసు నమోదు చేసి అనధికారిక గ్యాస్ బండలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ తహశీల్దారు సురేష్ బాబు మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ బండలు వాడకుండా అనధికారిక గ్యాస్ బండలు వాడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో పిడిఎస్ డిటి. రామ్మూర్తి రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పలు ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నందిగామ డివిజన్ స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ సహాయ సంచాలకులు శశికల ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. స్థానిక జుజ్జూరు రోడ్డులో శ్రీ విజయ దుర్గ పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులు పరిశీలించగా లైసెన్సు లో ఫారం ఓ లేకపోవటం వల్ల ఆమ్మకాలు నిలిపివేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ ఆధికారి కె.విజయ్ కుమార్ గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు లక్షల అమ్మకాలు దాటిన రాయల్ ఎన్ ఫీల్డ్ హంటర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మిడ్ సైజ్ మోటార్ సైకిల్ విభాగంలో అగ్రగామిగా కొనసాగుతున్న రాయల్ ఎన్ ఫీల్డ్ తన కాంపాక్ట్, స్టైలిష్ హంటర్ 350 ఐదు లక్షల విక్రయాల మైలు రాయి దాటిందని రాయల్ ఎన్ ఫీల్డ్ ఏరియా ఇన్చార్జి కౌశిక్ తెలిపారు. నగరంలోని రాయల్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఆగస్టు 2022లో విడుదలైన హంటర్ అతి కొద్ది రోజుల్లోనే 5 లక్షల వాహనాలు విక్రయాలు జరగడం సంతోషకరమన్నారు. అత్యంత వేగంగా అభివీద్ధి చెందుతున్న మోటార్ సైకిల్ మోడల్స్‌లో రాయల్ ఎన్ ఫీల్డ్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని నూతన మోడల్స్ తీసుకురానున్నట్లు తెలిపారు.